విజయపురం మండలం తమిళనాడు సరిహద్దుల్లో ఉండడంతో ఈ ప్రాంతంలోని గ్రావెల్‌కు మంచి డిమాండ్ ఉంది. తమిళనాడులో వాల్టా చట్టం కఠినంగా అమలు చేస్తున్నారు. అక్కడ గ్రావెల్ తరలింపును ప్రభుత్వం నిషేధించింది. ఈ నిషేధం మన రాష్ట్ర సరిహద్దు విజయపురం మండలంలోని టీడీపీ నేతలకు వరంగా మారింది. మండలంలోని విజయపురం, ఇల్లత్తూరు, మహారాజపురం, శ్రీహరిపురం, మల్లారెడ్డికండ్రిగ, కేశవపురం గ్రామాల్లో గ్రావెల్ పుష్కలంగా ఉండడంతో తమిళనాడుకు తరలించేసేందుకు పథక రచన చేశారు. అధికారం ఉండడంతో క్వారీలకు కాంట్రాక్టు ఇప్పించి దగ్గరుండి మరీ తమిళనాడుకు తరలించి లక్షలు గడిస్తున్నారు. క్వారీల నుంచి లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి తమిళనాడుకు తరలిపోతుండడంతో ప్రకృతి ప్రసాదిత కొండలు, గుట్టలు కనుమరుగవుతున్నాయి. – విజయపురం


మహారాజపురం కొండపై గ్రావెల్ తరలిస్తున్న టిప్పర్లు

కొండలు కరుగుతున్నాయి

- తమిళనాడుకు తరలిపోతున్న గ్రావెల్
- తమిళనాట చట్టాలు కఠినతరం
- ఆంధ్రాలో లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి తరలింపునకు అనుమతి
- సంపద సృష్టించుకుంటున్న పచ్చనేతలు

తమిళనాడులో ప్రకృతి సంపదను రక్షించే వాల్టా చట్టం కఠినంగా అమలు చేస్తున్నారు. అక్కడ గ్రావెల్ తరలింపును ప్రభుత్వం నిషేధించింది. జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా ఆ రాష్ట్రంలో రోడ్డు వేయాలన్నా కూడా అనుమతులు ఇవ్వడం లేదు. తమిళనాడు రాష్ట్రం తిరువళ్లూరు హైవే నుండి వేపంబట్టు, తన్నెకులం, సెవ్వాపేట మీదుగా నాలుగు లైన్ల హైవే రోడ్డు సుమారు 18 కిలోమీటర్ల నిర్మాణం పనులు జరుగుతున్నాయి. ఈ పనులకు అవసరమైన గ్రావెల్ తీసుకోవడానికి తిరువళ్లూరు సమీపంలో 15 కిలోమీటర్ల దూరంలోని పూండి, తోమ్మూర్, పెన్నాలూరుపేట, అల్లికుయి, సీతంజేరి, నారాయణపురం ప్రాంతాలలో సుమారు 30 కిలోమీటర్ల విస్తీర్ణంలో కొండలు, గుట్ట ప్రాంతాలు ఉన్నాయి. అయితే ఆ కొండల్లో ఎక్కడా గ్రావెల్ తీసుకునేందుకు తమిళనాడు ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదు. దీంతో అక్కడి నుంచి 35 కిలోమీటర్ల దూరంలోని విజయపురం నుంచి గ్రావెల్ తరలించుకునేందుకు జాతీయ రహదారి అధికారులు సిద్ధమయ్యారు. స్థానికంగా ఉన్న టీడీపీ నేతలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. తమ అధికార బలంతో ఇందుకు అవసరమైన 98,620 క్యూబిక్ మీటర్ల మట్టిని అందించడానికి సిద్ధమయ్యారు. ఇక్కడి మైనింగ్ అధికారులు 4.931 హెక్టార్ల మేరకు గుట్టలను గత ఏడాది డిసెంబర్ 21న అనుమతులు మంజూరు చేయించారు. ఇదే అదనుగా కోట్లు విలువ చేసే లక్షల క్యూబిక్ మీటర్ల గ్రావెల్ తమిళనాడుకు తరలివెళుతోంది. ఈ గ్రావెల్ తరలింపు టీడీపీ నేతలకు కాసుల వర్షం కురిపిస్తోంది. అధికారులు భూగర్భ వనరులను పట్టించుకోకుండా తమ స్వంత ఆదాయం కోసం కొండలు, గుట్టలను అమ్ముకుతింటున్నారని రైతులు దుమ్మెత్తిపోస్తున్నారు. ప్రజాభిప్రాయ సేకరణ లేకుండానే లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి తరలింపునకు అనుమతి ఎలా ఇస్తారని ప్రశ్నిస్తున్నారు. ఆదాయం సృష్టించడమంటే మన రాష్ట్ర సంపదను ఇతర రాష్ట్రాలకు పంపి టీడీపీ నేతలకు ఆదాయాన్ని పెంచడమా అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


తమిళనాడు వైపు వెళ్లుతున్న టిప్పర్

దొంగ సంతకాలతో అనుమతి

గ్రావెల్ క్వారీకి అనుమతి పొందాలంటే పంచాయతీ తీర్మానం, మేటి రైతుల సంతకాలు తప్పనిసరి. కానీ గ్రావెల్ అనుమతి కోసం తీసుకొన్న మేటి రైతుల సంతకాలు అధికారులు ఫోర్జరీ చేశారన్న ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయి. తమకు తెలియకుండా అధికారులు అనుమతులు ఇచ్చారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రావెల్ క్వారీకి 700 మీటర్ల దూరంలో ఒక కాలేజీ, కిలో మీటరు దూరంలో రెండు గ్రామాలు, 1.5 కిలోమీటరు దూరంలో మూడు గ్రామాలు ఉన్నాయి. ఈ గుట్టలపైనే మేకలను, గొర్రెలను మేతకు తీసుకెళ్లేవారని స్థానికులు చెబుతున్నారు. అవి కూడా లేకుంటే మూగజీవాలను ఎక్కడ మేపుకోవాలని ప్రశ్నిస్తున్నారు. జిల్లా అధికారులు స్పందించి క్వారీలను ఆపకుంటే నిరసనలు తప్పేటట్టు లేవు.

ఎప్పటి అర్జీలకో ఇప్పుడు అనుమతులు

గ్రావెల్ క్వారీలకు దరఖాస్తులు నేను బాధ్యతలు తీసుకోక ముందే పెట్టినవి. వాటికి గత ఏడాది డిసెంబరులో అనుమతులు వచ్చాయి. ఆ మేరకే అక్కడ గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నాయి. ఎంత గ్రావెల్ తరలిపోతుందనేది అప్పుడప్పుడూ తనిఖీ చేస్తాం.
– కిరణ్, తహసీల్దార్, విజయపురం మండలం

యువతే దేశ భవిత

కార్వేటినగరం: దేశ భవితకు యువతరం ఎంతో అవసరమని డీఎం పురం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కేశవులు అన్నారు. ఆదివారం డీఎం పురం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కేశవులు స్వామి వివేకానంద వేషధారణతో ఉపాధ్యాయులు, గ్రామస్తులను ఆకట్టుకున్నారు. అలా గే స్వామి వివేకానంద చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ యువతే దేశ భవిష్యత్తు అంటూ విద్యార్థుల్లో వివేక స్ఫూర్తి వచనాలను నింపారు. భారతదేశ ఔన్నత్యాన్ని ప్రపంచ వ్యాప్తం చేసిన యువత స్ఫూర్తి ప్రదాత స్వామి వివేకానంద జయంతి వేడుకలను ఘనంగా జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఇనుప కండరాలు, ఉక్కు నరాలు, వజ్ర సంకల్పం ఉన్న యువత ఈ దేశానికి వెన్నెముక అంటూ జీవిత విశేషాలను సర్వమత మహా సభలలో స్వామీజీ సనాతన ధర్మం గొప్పతనాన్ని తెలిపిన విధానాన్ని విద్యార్థులకు వివరించారు. అనంతరం పాఠశాల కమిటీ చైర్మన్ త్యాగరాజు మాట్లాడుతూ సుస్థిర భవిష్యత్తు కోసం యువత స్థితి స్థాపకత, బాధ్యతతో దేశాన్ని రూపొందించడం నేటి యువత బాధ్యత అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రంజిత్‌కుమార్, బొబ్బిలిరెడ్డి, విజయకుమార్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.


స్వామి వివేకానంద వేషధారణలో హెచ్‌ఎం కేశవులు

క్లుప్తంగా

కోడి పందాలు నిర్వహిస్తే చర్యలు


వెంకటసుబ్బయ్య

వెదురుకుప్పం: సంక్రాంతి సంబరాలలో భాగంగా మండలంలో ఎక్కడైనా కోడి పందాలు నిర్వహిస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య హెచ్చరించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పేకాట, జల్లికట్టు, కోడి పందాలు వంటి కార్యక్రమాలు నిషేధమన్నారు. ప్రభుత్వ నిషేధిత కార్యక్రమాలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. గ్రామాల్లో కోడి పందాలు చేపట్టినా ప్రోత్సహించినా ఎవరినీ ఉపేక్షించేది లేదన్నారు. పండుగను సంప్రదాయ రీతిలో ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. మద్యం తాగి గ్రామాల్లో అల్లర్లకు పాల్పడితే జైలు శిక్ష తప్పదన్నారు. ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినట్లు తెలిస్తే వెంటనే తమ సెల్ 9440900691 నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు.

చర్చిలో సంక్రాంతి సంబరాలు


చర్చిలో సంక్రాంతి సంబరాలు

నగరి: మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే సంక్రాంతి పండుగను స్థానిక సీఎస్‌ఐ ఈస్ట్ పాస్టరేట్ చర్చిలో నిర్వహించడం ప్రత్యేకత సంతరించుకుంది. సంక్రాంతి పండుగ సందర్భంగా పాస్టర్ జొనాథన్ లెక్లర్ ఆధ్వర్యంలో చర్చిలో చెరకు గడలు, పొంగలి కుండలు ఏర్పాటు చసి సంక్రాంతి వాతావరణాన్ని తలపించారు. అందరికీ మంచి జరగాలంటూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పాస్టర్ మాట్లాడుతూ పండుగలు మతాలకు అతీతమన్నారు. ప్రతి పండుగ ప్రజలకు ఆనందాన్ని పంచేదిగా ఉండాలన్నారు. ప్రార్థన అనంతరం చక్కెర పొంగలి, చెరకు గడలను అందించారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవులు పాల్గొన్నారు.

శ్రీవేణుగోపాలుని సేవలో డీఎస్పీ


శ్రీవేణుగోపాల స్వామివారి దర్శనానికి విచ్చేసిన చిత్తూరు డీఎస్పీ దంపతులు

కార్వేటినగరం: కార్వేటినగరం ప్రసిద్ధ రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామివారిని చిత్తూరు డీఎస్పీ(దిశ) విజయశేఖర్ దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. డీఎస్పీ దంపతులకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. అలాగే స్వామి దర్శనం అనంతరం ఆలయ ఆవరణలో వేద మంత్రాలతో ఆశీర్వచనాలు అందించి, తీర్థ ప్రసాదాలను అందించారు. డీఎస్పీ విజయశేఖర్ ఆలయ విశేషాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఏఎస్‌ఐ మునికృష్ణ, ఆలయ అధ్యక్షుడు సురేష్‌కుమార్, షరాబు బాబుసురేష్, వేద పండితులు ఉన్నారు.

గోవిందయ్య కుటుంబానికి పరామర్శ


గోవిందయ్య కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ మంత్రి ఆర్కే రోజా

నగరి: నగరి రూరల్ మండలం ముడిపల్లి పంచాయతీ వైఎస్సార్ సీపీ నాయకుడు గోవిందయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆదివారం మాజీ మంత్రి ఆర్కే రోజా ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తన కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆమె వెంట పార్టీ నాయకులు ఉన్నారు.

పల్లెలకు సంక్రాంతి శోభ


తాటిమట్టలు ముడేసి భోగి మంటలకు తీసుకొస్తున్న చిన్నారులు

పాలసముద్రం: తెలుగింట ఆబాల గోపాలాన్ని అలరించే సంబరాల సంక్రాంతికి మరొక రోజు మాత్రమే గడువుంది. పెద్ద పండగకు నాంది పలికేది భోగి. చిమ్మునీకట్లను పారద్రోలే భోగి మంటలు వేసేందుకు చిన్న పెద్ద తారతమ్యం లేకుండా అందరు ఉత్సాహం చూపిస్తుంటారు. చిన్నారులు తాటిమట్టల వేటలో నిమగ్నమయ్యారు. గ్రామాల్లో తమ తమ వీధుల్లో భోగి మంటలు వేసేందుకు చిన్నారులు ఏకమై తాటిమట్టలు, ఇంటింటికీ వెళ్లి పిడకలు వేయమంటూ హడావిడి చేస్తున్నారు. ఎవరికి వారు తమ వీధిలో పెద్ద భోగి మంటను వేసేందుకు పోటీ పడుతున్నారు. సంక్రాంతి సెలవులు ఇవ్వడంతో చిన్నారుల సందడి మరింత పెరగనుంది.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి


నగరి: మాజీ మంత్రిని సన్మానిస్తున్న కమిటీ సభ్యులు


పుత్తూరు: చిరంజీవిని సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

నగరి: తనపై నమ్మకంతో వైఎస్సార్ సీపీ ఇచ్చిన పదవిని బాధ్యతగా నిర్వహించి, పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని ఆ పార్టీ క్రియాశీలక కార్యదర్శిగా ఎంపికైన లీలారామన్ తెలిపారు. పదవులు రావడానికి కారణమైన మాజీ మంత్రి ఆర్కే రోజాను పూలదండలు, దుశ్శాలువాలతో సత్కరించి, కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బాబు, చంద్ర పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ పూర్వ వైభవానికి కృషి

పుత్తూరు: వైఎస్సార్ సీపీ పూర్వ వైభవానికి తన వంతు కృషి చేస్తానని ఆ పార్టీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్.చిరంజీవి తెలిపారు. జిల్లా పార్టీలో పదవి వచ్చిన సందర్భంగా ఆదివారం స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు చిరంజీవిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు జిల్లా కమిటీలో పదవి రావడానికి కారణమైన మాజీ మంత్రి ఆర్కే రోజాకు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని స్పష్టం చేశారు. మున్సిపల్ చైర్మన్ హరి, వైస్ చైర్మన్లు శంకర్, జయప్రకాష్, వెంకటేశులు, మనోహర్‌రెడ్డి, ఏకాంబరం, జయచంద్రన్, జయరామిరెడ్డి, మునిరత్నం, చిన్నా, కుట్టి, చక్రి, శివ, గుణ, సుబ్రమణ్యం, అన్నా లోకనాథం, చిరంజీవి పాల్గొన్నారు.

జగనన్నతోనే సంక్షేమం సాధ్యం

వెదురుకుప్పం: పేదలకు అన్ని రకాల సంక్షేమ పథకాలు అందాలంటే మళ్లీ జగనన్న ముఖ్యమంత్రి అయితేనే సాధ్యమవుతుందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బట్టే సుబ్రమణ్యం అన్నారు. ఆదివారం వెదురుకుప్పంలో పార్టీ నాయకులతో కలిసి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్‌సిక్స్ హామీల్లో ఏ ఒక్కటీ సక్రమంగా అమలు చేయకుండా డైవర్షన్ రాజకీయాలు చేస్తున్న కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నట్లు పేర్కొన్నారు. కేవలం ధనవంతులు, సంపన్నుల కోసమే ప్రభుత్వం పని చేస్తుందే తప్ప ప్రజా సమస్యలను గాలికొదిలేసినట్లు విమర్శించారు. అనంతరం రాష్ట్ర కార్యదర్శి పేట ధనుంజయరెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేని కూటమి ప్రభుత్వం నిత్యం మాజీ సీఎం జగన్‌పై నిందలు వేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నట్లు చెప్పారు. జగన్ హయాంలో కులమతాలకు అతీతంగా సంక్షేమాన్ని తీసుకొస్తే ప్రస్తుతం కుటిల రాజకీయాలు చేస్తూ అన్ని వర్గాలనూ మోసం చేస్తున్నట్లు మండిపడ్డారు.

ఘన సన్మానం

వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీలో మండలంలోని సీఆర్‌కండ్రిగ గ్రామానికి చెందిన మరకాలకుప్పం రామయ్యకు కార్యనిర్వాహక కార్యదర్శి పదవి దక్కింది. దీంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. కేక్‌కట్ చేసి గజమాల వేసి దుశ్శాలువాలతో ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా రామయ్య మాట్లాడుతూ పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు అందరితో కలిసి శాయశక్తులా పనిచేస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కో–ఆప్షన్ సభ్యుడు వెంకటేష్, బొమ్మయ్యపల్లె సర్పంచ్ గోవిందయ్య, పార్టీ జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు శివాజీ, మాజీ సర్పంచ్‌లు చిరంజీవిరెడ్డి, గోవిందన్, రమేష్‌రెడ్డి, హనుమంతరెడ్డి, నాయకులు పురుషోత్తం రెడ్డి, లోకనాథం, మునికృష్ణారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.


రామయ్యను గజమాలతో సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక


గురువులతోపాటు పూర్వ విద్యార్థులు

పెనుమూరు: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. 2005–07 ఏడాది ఇంటర్మీడియట్ విద్యనభ్యసించిన విద్యార్థులు 20 సంవత్సరాల తరువాత కలుసుకోవడంతో వారి ఆనందాలకు అవధులు లేకుండా పోయింది. కళాశాలలో ఆనాటి మధురానుభూతులను గుర్తు చేసుకుంటూ కళాశాలలో కలియదిరిగారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న నాటి గురువులు నరసింహులు, దామోదరరెడ్డి, శ్రీనివాసులురెడ్డిని పూర్వ విద్యార్థులు శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందించి ఘనంగా సన్మానించారు. నాటి గురువు నరసింహులు మాట్లాడుతూ క్రమ శిక్షణతో కూడిన విద్యాభ్యాసం ఎంతో అవసరమని తెలిపారు. రోహిత్, ఆనంద్, రంగస్వామి, ఏకాంబరం, ఉదయ్, వెంకటేష్, స్వాతి, శాంతి, హేమలత, యువరాజ్, మునస్వామి, మహేష్, అమర్, భాను, లత తదితరులు పాల్గొన్నారు.

వీధిలైట్లు ఏర్పాటు


ఆలపాకంలో వీధి లైటు ఏర్పాటు

విజయపురం: మండలంలోని ఆలపాకం పంచాయతీలో ఆదివారం వీధిలైట్లు వేశారు. సంక్రాంతి పురస్కరించుకుని పంచాయతీలోని అన్ని గ్రామాల్లో మరమ్మతులకు గురైన వీధిలైట్లు తొలగించి, ఆ స్థానంలో నూతన లైట్లు ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ బాబు తెలిపారు.

స్ఫూర్తి ప్రదాత స్వామి వివేకానంద

పుత్తూరు: నేటి యువత స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకోవాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ ఎ.నాగేశ్వరరావు సూచించారు. ఆదివారం కళాశాలలో జాతీయ యువజన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ఆవరణలోని వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ జనవరి 12వ తేదీన వివేకానంద జయంతినే జాతీయ యువజన దినోత్సవంగా జరుపుకొంటున్నట్లు తెలిపారు. యువత స్వచ్ఛంద సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని కోరారు. గ్రామాభివృద్ధిలో యువత భాగస్వాములు కావడం ద్వారా సమసమాజ స్థాపన సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు రఘురామన్, వెంకటేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్రాంతి రంగులు


చావడి ప్రాంతంలో రంగులు విక్రయిస్తున్న మహిళ

నగరి: హిందూ సంప్రదాయంలో ముగ్గులకు అధిక ప్రాధాన్యం ఉంది. ముగ్గులు వేయడానికి ఎంతో చారిత్రక సంబంధం కూడా ఉంది. ముగ్గుల్లో తామర పువ్వు, పూల ఆకారాలు, నెమళ్లు, మామిడి పండ్లు, చేపల చిహ్నాలు ఎక్కువగా ఉంటాయి. రంగురంగుల ముగ్గులను చూసినప్పుడు ప్రశాంతత, దైవీక శక్తుల ఉనికిని ప్రజలు అనుభవిస్తారు. ఇంట్లోకి దేవతలను స్వాగతించడానికి, ప్రజలను ఆశీర్వదించడానికి దేవతల చిత్రాలను, లక్ష్మీ దేవి పాద చిహ్నాలను గీస్తారు. అలాగే అతిథులను స్వాగతించడానికి కూడా ఇలా ముగ్గులు వేస్తారు. అయితే చరిత్ర మాత్రం చెడున అరికట్టి మంచి చేకూరాలనే ఉద్దేశంతో తెల్లటి బియ్యపుపిండితో ముగ్గు వేస్తారని చెబుతోంది. సంక్రాంతి అంటేనే ఇంటి ముందు రంగురంగుల ముగ్గులు.. ముగ్గుల మధ్య గొబ్బిళ్లతో ప్రతివాకిలి కళకళలాడుతుంది. దీంతో సంక్రాంతి ముగ్గులకు వేసే రంగుల విక్రయాలు విరివిగా సాగుతున్నాయి. 12 రంగులు వంద రూపాయలు, ప్యాకెట్ రంగులు, రంగు ముగ్గురాళ్లు అంటూ విక్రయాలు ఊపందుకున్నాయి.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పాలసముద్రం: మహీంద్ర థార్ వాహనం అదుపు తప్పి ఢీకొనడంతో వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. బలిజకండ్రిగ వైపు వెళుతున్న థార్ వాహనం ఇందిరానగర్ గ్రామానికి చెందిన గోవింద మండడి మోటార్ సైకిల్‌పై వస్తుండగా కుమ్మిఇండ్లు వద్ద ఢీకొట్టింది. గోవింద మండడి కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గోవింద మండడి బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కోడెగిత్తల పౌరుషం.. యువత ఉత్సాహం

వెదురుకుప్పం: ఉత్సాహం ఉరకలేసింది.. కోడెగిత్తలు రంకెలేశాయి.. జనసమూహాన్ని చీల్చుకుంటూ దూసుకుపోయిన పోట్లగిత్తలు పౌరుషాన్ని చూపాయి. ఎడ్ల వేగాన్ని నియంత్రించలేక యువత ప్రేక్షకపాత్ర వహించారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా మండలంలోని పెరుమాళ్లపల్లెలో ఆదివారం జరిగిన జల్లికట్టు జోష్ తెచ్చింది. కాలుదువ్విన కోడె గిత్తలు రంకె వేయగా.. యువత కేరింతలు మధ్య జల్లికట్టు దుమ్ము రేపింది. యువత గ్రామంలో పశువుల పందేలకు పెద్దఎత్తున ఏర్పాట్లు చేశారు. ముందుగా ఎడ్లకు పలకలు, వస్త్రాలతో పాటు బెలూన్‌లు కట్టారు. అంతకుముందే వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో యువత అక్కడికి చేరుకున్నారు. పలకల కోసం అల్లి వద్ద యువత నిలబడగా నిర్వాహకులు ఎడ్లను ఉసిగొల్పారు. దీంతో రంకెలేస్తూ దూసుకుపోతున్న ఎడ్లను యువత కట్టడి చేసేందుకు ప్రయత్నించారు. పలకలు పట్టేందుకు యువత పోటీలు పడ్డారు. పలకలు పట్టిన యువత తమ విజయ దరహాసంతో చిందులు వేశారు. అయితే కొన్ని ఎడ్లు జన ప్రవాహాన్ని సైతం లెక్క చేయకుండా యువతకు చిక్కకుండా పరుగులు తీశాయి. పలుమార్లు ఎడ్ల జోరుకు కళ్లెం వేయలేక యువత ప్రేక్షక పాత్ర వహించాల్సి వచ్చింది. చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన వారితో గ్రామం జనంతో కిక్కిరిసింది. పెరుమాళ్లపల్లె ఎంపీటీసీ మురళీరెడ్డి, పెద్దలు పోటీలను ప్రారంభించారు.


ప్రారంభిస్తున్న ఎంపీటీసీ మురళీరెడ్డి



దూసుకుపోతున్న కోడెగిత్తలు